ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

శుక్రవారం 12 జనవరి 2024 | 5

జనసేన ఫ్లెక్సీ చింపిన వైసీపీ కార్యకర్త

కత్తి, రాడ్డుతో వీరంగం.. జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిరసన

జలదీక్ష



తమ డిమాండ్లను తక్షణం ప్రభుత్వం ఆమోదించాలని కోరుతూ పి.గన్నవరం అక్విడెక్టు వద్ద వైనతేయ గోదావరినదిలో అంగన్‌వాడీలు జలదీక్ష చేసి వినూత్న నిరసన తెలియజేస్తున్న దృశ్యం - పి.గన్నవరం

వేడుకలతోనూ నిరసన



ముమ్మిడివరంలోని అంగన్‌వాడీ దీక్షా శిబిరంలో ఒక చిన్నారికి పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు


ముమ్మిడివరం, జనవరి 11: డిమాండ్ల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె 31వ రోజుకు చేరుకుంది. ప్రాజెక్టు పరిధిలోని ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాలకు చెందిన అంగన్‌వాడీలు, కార్యకర్తలు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు ముమ్మిడివరం సీడీపీవో కార్యాలయం వద్ద చేపట్టిన దీక్షా శిబిరంలో చిన్నారులకు పుట్టినరోజు వేడుక, అన్నప్రాసన, పౌష్టికాహారం పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఒక అంగన్‌వాడీ కార్యకర్త చిన్నారి పుట్టినరోజు కావడంతో ఆ పాప కేక్ కట్‌చేయించి వేడుకలు జరిపారు. మరో చిన్నారికి అన్నప్రాసన నిర్వహించారు. సొంత ఖర్చులతో చిన్నారులకు కోడిగుడ్డు, పప్పు అన్నంతో పౌష్టికాహారాన్ని అందించి తమ తమ న్యాయమైన డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని వారు డిమాండు చేశారు.

24 గంటల దీక్ష



ఇరవై నాలుగు గంటల దీక్షలో భాగంగా శిబిరంలో నిద్రపోతున్న అంగన్‌వాడీలు

బరిలోకి..



సంక్రాంతి సమయం దగ్గరపడుతోంది. పండుగ సందడి మొదలవుతోంది. ఈ సందడి ముసుగులో కోడి పందాలకు కోనసీమ జిల్లావ్యాప్తంగా శరవేగంగా ఏర్పాట్లు సాగిపోతున్నాయి. పందాలు జరిగే ప్రాంతాల్ని చదును చేయడం, గ్యాలరీల ఏర్పాట్లకు అవసరమైన ఏర్పాట్లు చేయడంలో పందెంరాయుళ్లు రంగంలోకి దిగారు. పందాలతోపాటు జరిగే జూదక్రీడలకు వేలం పాటలు సైతం నిర్వహించేస్తున్నారు. కాట్రేనికోన మండలం పరిధిలో బరుల వద్ద నిర్వహించే గుండాట నిర్వహణకు రూ.50 లక్షలు పైబడి వేలం జరిగినట్టు సమాచారం. పి గన్నవరం నియోజకవర్గ పరిధిలో నాలుగుచోట్ల బరుల వద్ద గుండాటల నిర్వహణకు రూ.33 లక్షలకు బహిరంగ వేలం నిర్వహించినట్టు సమాచారం. మిగిలిన చోట్ల ఒకటి రెండు రోజుల్లో వేలం పాటలను పూర్తి చేయనున్నారు. పోలీసులు మాత్రం యథావిధిగా హెచ్చరికల ఫ్లెక్సీలను పందెం బరుల వద్ద కట్టి ఫొటోలు దిగుతున్నారు.

- సిద్ధమవుతున్న పెందెం బరులు..
- హెచ్చరిస్తున్న పోలీసు, రెవెన్యూ అధికారులు
- గుండాటల నిర్వహణకు బహిరంగ వేలం పాటలు
- గెద్దనపల్లిలో భారీ బరి ఏర్పాటుకు సన్నాహాలు
- బరుల వద్ద ఫ్లెక్సులతో పోలీసుల ఆర్భాటం
- షరా మామూళ్లగానే సన్నాహాలు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి పర్వదినాల ముసుగులో జూదక్రీడల నిర్వహణకు పందెంరాయుళ్లు సర్వం సిద్ధంచేస్తున్నారు. ఎక్కడికక్కడే బరులు రెడీ చేస్తున్నారు. మరోవైపు గుండాటల నిర్వహణకు బహిరంగ వేలాలు నిర్వహిస్తున్నారు. ఇంకోవైపు పోలీసు యంత్రాంగం ఎక్కడికక్కడే బరులు నిర్వహించే ప్రాంతాల్లో హెచ్చరికల ఫ్లెక్సీలు పెట్టి హడావుడి చేస్తున్నారు. దాంతో ఆయా ప్రాంతాలకు చెందిన నిర్వాహకులు స్టేషన్ల వద్దకు వచ్చి మంతనాలు సాగిస్తున్నట్టు తెలిసింది. జిల్లావ్యాప్తంగా అన్ని ముఖ్య ప్రాంతాల్లో ఈసారి కోడి పందాలు, గుండాట, పేకాటలు నిర్వహించడానికి అధికార వైసీపీ ప్రజాప్రతినిధులు ప్రత్యక్ష ప్రమేయంతో జూదక్రీడల నిర్వహణ ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. పోలీసు, రెవెన్యూ యంత్రాంగం పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు చేపడతామంటూ ఎక్కడికక్కడే హెచ్చరికలు జారీచేయడంతోపాటు సమావేశాలు, టెలీ, వీడియోకాన్ఫరెన్సులు నిర్వహిస్తున్నారు. జిల్లా పరిధిలోని రామచంద్రపురం నుంచి రాజోలు వరకు ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలోని గతంలో నిర్వహించే ప్రాంతాల్లోనే పందెంబరుల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలోని కాట్రేనికోన మండలం గెద్దనపల్లి, చెయ్యేరులలో భారీగా బరుల నిర్వహణకు ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. అక్కడ ఉన్న భూములు చదునుచేయడం, చెట్లకు తెల్ల సున్నం వేయడం, షామియానాలు వేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇక్కడ బరి వద్ద గుండాటల నిర్వహణకు రూ.50 లక్షలు పైబడే వేలం జరిగినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇక పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలోని గంటిపెదపూడి, నాగుల్లంక, పోతవరం, గన్నవరంలో నాలుగుచోట్ల బరులు ఏర్పాటు చేసే ప్రాంతాల వద్ద గుండాటల నిర్వహణకు రూ.33 లక్షలకు బహిరంగ వేలం నిర్వహించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇక వాడ్రేవుపల్లి గ్రామంలో క్లియరెన్సు రావాల్సి ఉంది. ముమ్మిడివరం మండలంలో కొత్తలంక, అయినాపురం, రాజుపాలెం తదితర ప్రదేశాల్లో పందాల నిర్వహణకు నిర్వాహకులు ముందుకు వచ్చినప్పటికీ పోలీసులు క్లియరెన్సు కోసం ప్రస్తుతం ఎదురుచూస్తున్నట్టు తెలిసింది. ఇందుకోసం ప్రత్యేక బృందాలు ఆయా సమీప పోలీసుస్టేషన్లలోని సిబ్బందితో షరా మామూళ్లగానే మంతనాలు జరుపుతున్నారు. అలాగే కొత్తపేట, రాజోలు, మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోను కీలక బరుల నిర్వహణకు స్థానిక ప్రజాప్రతినిధుల పర్యవేక్షణలోనే ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. అలాగే జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణ పరిసర ప్రాంతాల్లో పందాల నిర్వహణకు వైసీపీ నేతలు సమాయత్తమవుతున్నారు. అయితే జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆదేశాలతో పోలీసు అధికారులు ఎక్కడికక్కడే పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామంటూ ఇప్పటికే జారీ చేయడంతోపాటు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలకు కఠినమైన ఆదేశాలిచ్చారు. దీని నేపథ్యంలో ఆయా పోలీసుస్టేషన్ల పరిధిలో పందాలు నిర్వహించే వారితో ఎస్ఐలు సమావేశాలు నిర్వహించి హెచ్చరికలు జారీచేస్తున్నారు. అంతేకాకుండా గతంలో ఎక్కడైతే పందాలు నిర్వహించారో ఆ ప్రాంతాలకు వెళ్లి హెచ్చరికల ఫ్లెక్సీలు పెట్టి పోలీసు సిబ్బంది ఫొటోలు దిగుతూ వాటిని జిల్లా అధికారులకు పంపిస్తున్నారు. అయితే తెరవెనుక మాత్రం పందెం రాయుళ్ల సమీప పోలీసుస్టేషన్ల సిబ్బందితో టచ్‌లో ఉండి సంప్రదింపులు జరపడం ద్వారా ఏర్పాట్లకు క్లియరెన్సు తీసుకుంటున్నారు. ఇక నిర్వాహకులకు ఆదాయాన్నిచ్చే గుండాటల విషయంలో రాజకీయ నేతలే రంగప్రవేశం చేసి తమకు కావాల్సిన వాటా సొమ్ములను సమీకరించుకుంటున్నారు. రానున్న ఎన్నికలు కావడం వల్ల ఖర్చులు అధికంగా ఉన్న దృష్ట్యా సొమ్ములు నిర్వాహకుల నుంచి బలంగా గుంజేందుకు లాబీయింగ్‌లు చేస్తున్నారు. వారే పోలీసులు, ఆ పైస్థాయి అధికారులతో మాట్లాడి అనుమతులు ఇప్పిస్తామంటూ నమ్మబలుకుతున్నారు. గత మూడు రోజులుగా పోలీసుస్టేషన్లలోని ఎస్ఐలు, ఇతర సిబ్బంది పందాలు నిర్వహించే బరుల వద్దకు వెళ్లి ప్రచార ఆర్భాటం చేస్తున్న తీరు ప్రజల్లో మాత్రం చర్చనీయాంశమైంది.

ఆర్డీవో హెచ్చరిక..

అమలాపురం టౌన్, జనవరి 11: అమలాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో ఎవరైనా కోడిపందాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అమలాపురం ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి హెచ్చరించారు. ఆర్డీవో కార్యాలయంలో గురువారం డివిజన్‌లోని డీఎస్పీలు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, పశుసంవర్ధకశాఖ అధికారులతో కోడిపందాల నిర్వహణ అడ్డుకునేవిధంగా తీసుకోవలసిన చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కోడిపందాల నిర్వహణ చట్టవిరుద్ధమని, పండుగ సమయాల్లో కోడి పందాలకు ఎటువంటి అనుమతులు ఉండవన్నారు. క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండి తగు చర్యలు తీసుకోవాలని ఆర్డీవో ఆదేశించారు. అలాగే జూదక్రీడలు జరక్కుండా చర్యలు తీసుకునేందుకు ఆయా శాఖల అధికారులకు సూచనలు చేశారు.



అమలాపురం రూరల్ మండలం కామనగరువులో పందాల బరుల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటుచేసిన పోలీసులు



రెడీ

జాతి కోడిపుంజులకు మంచి గిరాకీ

పందెంకోళ్లకు బలం కోసం బాదం, పిస్తా.. ప్రత్యేక వ్యాయామాలు

మండపేట, జనవరి 11: పందాలు కోసం కోడిపుంజులు సిద్ధమయ్యాయి. వేలాది రూపాయల నుంచి లక్షల వరకు ఈ పందెం కోళ్లను విక్రయిస్తున్నారు. కోడిపుంజుల పెంపకం కేంద్రాల వద్ద పందెంరాయుళ్లు క్యూకడుతున్నారు. పందెంకోళ్లను ప్రత్యేక శిక్షణ ద్వారా సిద్ధం చేస్తారు. వీటికి మేత పెట్టడం దగ్గర నుంచి డీకొట్టడంలో శిక్షణ ఇవ్వడం వరకు అన్నీ ప్రత్యేక పద్ధతులను అనుసరిస్తారు. ప్రత్యేకమైన ఆహారంతోపాటు వ్యాయామం కూడా చేయిస్తుంటారు. పందాలకు సిద్ధంచేసే కోడి పుంజుల్లో చాలా రకాలు ఉన్నాయి. దేశీవిదేశీ రకాలు కూడా ఇక్కడ పందాలకు సిద్ధమవుతుంటాయి. వాటిలో ప్రధానమైన నెమలి, గౌడనెమలి, తెల్లనెమలి, కోడినెమలి, కాకిడేగ, కక్కెర, నల్లకక్కెర, రసంగి, గాజుకుక్కురాయి, అబ్రాస్, ఎర్రడేగ వంటి జాతులు ఉంటాయి. వీటిలో తెల్లనెమలి, గౌడనెమలి, రసంగి, అబ్రాస్ పుంజులు ఎక్కువగా పందాల్లో వేయడానికి ఆసక్తి చూపిస్తారు. ఇక కోడి పందాల్లో కత్తిపందాలతోపాటు జెట్టి పందాలు ఉంటాయి. కోడికాలుకి పదునైన కత్తినికట్టి బరిలో రెండు పుంజులను వదలడం కత్తిపందెం. కోడి కాలుకు కత్తికట్టకుండా కోడికాలుకు ఉండే కాటాతోనే రెండు పుంజులు డీకొట్టడం జెట్టిపందెం. అయితే సంక్రాంతి సమయంలో కత్తి పందాలే అధికంగా జరుగుతాయి. తక్కువ సమయంలో ఎక్కువ పందాల కోసం వీటికే మొగ్గుచూపుతారు. ఇక ఈ కోళ్లకు ఆహారంగా కోడిగుడ్డు, బాదం, పిస్తా, కర్జూరం, మెరికల ధాన్యం, తవుడు వంటివాటిని అందిస్తుంటారు. అలాగే నీళ్లలో ఈతకొట్టించడం, మరికొన్ని వ్యాయామాలు చేయిస్తుంటారు. ఈ పుంజులు రకాన్ని బట్టి రూ. 5వేల నుంచి రూ.1 లక్ష దాటి ధర పలుకుతున్నాయి. ఈ కోడిపుంజులు క్రయవిక్రయాల కోసం ఫేస్‌బుక్‌లో ప్రత్యేక పేజీలను పందెంరాయుళ్లు ఏర్పాటుచేసుకోవడం విశేషం.



కాట్రేనికోన మండలం గెద్దనపల్లిలో పందాలకు సిద్ధమవుతున్న బరి



పందెం కోళ్లకు పెడుతున్న ఆహారం



మండపేట మండలంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న కోడి పుంజులు

చలిలోనే నిద్ర!

- కలెక్టరేట్ ఎదురుగా అంగన్‌వాడీల నిరసన శిబిరం
- 24 గంటల దీక్షల్లో భాగంగా చలిలో రాత్రంతా శిబిరంలోనే

అమలాపురం టౌన్, జనవరి 11: సమస్యల పరిష్కారానికై అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారానికి 31వ రోజుకు చేరుకుంది. కలెక్టర్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు 24 గంటల దీక్షలను కొనసాగిస్తున్నారు. మండపేట ప్రాజెక్టు కార్యాలయం నుంచి వచ్చిన అంగన్‌వాడీలు 24 గంటల దీక్షలో పాల్గొనగా ప్రాజెక్టు కార్యదర్శి కె.బేబీగంగారత్నం, వెంకటలక్ష్మిలు ప్రారంభించారు. యూటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యుడు దీక్షాశిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని, నెలరోజులుగా నిరవధిక సమ్మెలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమని ఆయన పేర్కొన్నారు. అంగన్‌వాడీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.కృష్ణవేణి మాట్లాడుతూ అంగన్‌వాడీలపట్ల రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా ఆలోచిస్తుందన్నారు. పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేనిపక్షంలో ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధపడతామని హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుర్గాప్రసాద్, జిల్లా కోశాధికారి పి.అమూల్య, దైవకృప, మండపేట ప్రాజెక్టు ప్రతినిధులు మేడిశెట్టి దేవి, ఎస్.విజయలక్ష్మి, సీహెచ్ సత్యవేణి, ఎం.కమల, వి.కమల, జె.నిర్మలకుమారి, గౌరి, అశ్విని పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీ





ఆంధ్రజ్యోతి ఏబీఎన్ ఆధ్వర్యంలో విజయవాడలో గురువారం జరిగిన రాష్ట్ర స్థాయి కెనరా బ్యాంకు ముత్యాల ముగ్గుల పోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన బండారులంకకు చెందిన ఎండీఎస్ మల్లేశ్వరి

జిల్లాలో చిరువ్యాపారులకు రూ.55.09 లక్షలు

అమలాపురం టౌన్, జనవరి11: చిరువ్యాపారులకు జగనన్నతోడు నిధులు మేలు చేకూరుస్తున్నాయని కలెక్టర్ హిమాన్షుశుక్లా తెలిపారు. చిరువ్యాపారులు అధిక వడ్డీల బారినపడకుండా వారికి జగనన్న తోడు పథకం అండగా నిలుస్తుందన్నారు. జిల్లాలో ఏడో విడతగా 22,840 మంది లబ్ధిదారులకు వడ్డీ రాయితీ కింద రూ.55.09 లక్షలు జమచేయగా సంబంధిత చెక్కును కలెక్టరేట్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావులతో కలిసి కలెక్టర్ లబ్ధిదారులకు అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్‌ఖాదర్, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, ఎల్డీఎం కె.శ్యామ్‌బాబు, ఏపీడీ ఎంఎం జిలానీ పాల్గొన్నారు.



చిరు వ్యాపారులకు జగనన్నతోడు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ తదితరులు

వివాదాస్పద అధికారులను ఎన్నికల విధుల్లో నియమించరాదు : జిల్లా కలెక్టర్

అమలాపురం, జనవరి11(ఆంధ్రజ్యోతి):గత సార్వత్రిక ఎన్నికల్లో వివాదాస్పదంగా వ్యవహరించిన అధికారులకు త్వరలో జరిగే ఎన్నికల్లో ఎటువంటి విధులు కేటాయించరాదని కలెక్టర్ హిమాన్షుశుక్లా ఆదేశించారు. విశ్రాంత ఉద్యోగులను ఎన్నికల విధులకు కేటాయించరాదన్నారు. ఓటర్ల తుది జాబితా ప్రచురణ అనంతరం అధికారులకు విధులు కేటాయించే అవకాశం ఉంది. ప్రధానంగా గర్భిణీలు, దివ్యాంగులకు ఎన్నికల విధులను కేటాయించరాదని స్పష్టంచేశారు. ప్రస్తుతం జిల్లాలో పోస్టులు ఉన్నప్పటికీ వాటిలో పనిచేసే ఉద్యోగుల సంఖ్య తగ్గడంతో ఎన్నికల నిర్వహణకు సిబ్బంది కొరత ఉందన్నారు. లోక్‌సభ, అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికలు ఏకకాలంలో నిర్వహణకు సంబంధించిన మార్గదర్శకాలను విధిగా పాటించాలని స్పష్టంచేశారు. నాలుగేళ్లు ఒకేచోట పనిచేసిన వారికి బదిలీలు చేపట్టాల్సిన అంశాలపై దిశానిర్దేశం చేశారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లాస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నాలుగేళ్లు పైబడి ఒకేచోట ఉన్న ఉద్యోగులను నేటివిటి ఉన్న నియోజకవర్గంలో కాకుండా పక్క నియోజకవర్గాలకు బదిలీ చేయాలని సూచించారు. ఎనిమిది నుంచి పది పోలింగ్ కేంద్రాలకు ఒక సెక్టార్ అధికారిని నియమిస్తామన్నారు. పోలింగ్‌కు ముందే మూడు పర్యాయాలు ఆయా కేంద్రాలను తనిఖీచేసి కనీస వసతులను పరిశీలించాలన్నారు. ఎక్కడైనా ఈవీఎంలు పాడైతే కేవలం 15 నుంచి 20 నిమిషాల్లో మరమ్మతులు చేయాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహించేందుకు సన్నద్ధం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అటవీ, వాణిజ్య, రవాణాశాఖల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో విభాగాల వారు చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘా ఏర్పాటుచేసి మద్యం, నగదు రవాణా నివారణా చర్యలు పక్కాగా చేపట్టాలన్నారు. సహకార శాఖ ఆడిట్ విభాగం, ట్రెజరీ అధికారులను వ్యయ పరిశీలకులు, ఆడిటర్లుగా నియమిస్తామన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు మాట్లాడుతూ ఈ నెల 26న గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులకు విధులు, బాధ్యతలను కేటాయించారు. సంక్షేమాభివృద్ధి శాఖల శకటాల పోటీల నిర్వహణకు సన్నద్ధం కావాలన్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందించేందుకు గతంలో తీసుకున్నవారిని మినహాయించి మిగిలినవారి పేర్లు సూచించాలని స్పష్టంచేశారు.

భూరక్షా రీసర్వే మూడో దశ పూర్తిచేయాలి..

వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్షా రీసర్వే మూడో దశ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా సర్వే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధిహామీ ద్వారా వేతన జీవులకు పూర్తిస్థాయి పనులు కల్పించడంతోపాటు సరాసరి వేతనాలు అందించాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల నిర్మాణాలను సత్వరం పూర్తిచేయాలన్నారు. రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై సమీక్షించారు. సమావేశంలో జేసీ నుపూర్అజయ్, డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, సీపీవో వెంకటేశ్వర్లు, జిల్లా మహిళాశిశు సంక్షేమాఖ సాధికారిత అధికారిణి జీవీ సత్యవాణి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, పంచాయతీరాజ్ ఎస్ఈ కె.చంటిబాబు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సీహెచ్ఎన్వీ కృష్ణారెడ్డి, డీపీవో వంగా కృష్ణకుమారి, ఏడీ కె.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ హిమాన్షుశుక్లా



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నుపూర్అజయ్

మాతాశిశు మరణాల రేటు పూర్తిగా తగ్గించాలి : జేసీ నుపూర్

అమలాపురం టౌన్, జనవరి 11: మాతా శిశు మరణాల రేటును పూర్తిగా తగ్గించేందుకు గర్భిణీల ఆరోగ్య పరిరక్షణ పట్ల వైద్యులు అప్రమత్తంగా ఉంటూ ఏ ఒక్క ప్రాణ నష్టం జరగకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా వైద్యసేవల సమన్వయ అధికారి ఆధ్వర్యంలో జేసీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మాతా శిశుమరణాలపై విచారణ జరిపించాలన్నారు. అలసత్వం, ప్రమాదవశాత్తూ మాతా శిశుమరణాలు జరిగాయా అన్న కోణంలో విచారించడం జరిగిందన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పద్మశ్రీ రాణి, పీహెచ్‌సీ వైద్యాధికారులు పాల్గొన్నారు.

హరివిల్లు.. సిరిజల్లు..

వైభవంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్





ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

"ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్‌బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్స్ స్వర్గసీమ సుకేతన" ఫైనల్స్ గురువారం విజయవాడలో అంగ'రంగుల' వైభవంగా జరిగాయి. బెంజిసర్కిల్ సమీపంలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీ టెన్నిస్ కోర్టులో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల స్థాయిలో విజేతలుగా నిలిచిన మహిళలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కూడా పాల్గొన్నారు. తమ సృజనతో ముత్యాల ముగ్గుల్లో రంగుల దృశ్యాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ ఏజీఎం జీవీ నరసింహారావు, కెనరా బ్యాంక్ మార్కెటింగ్ సర్కిల్ సీనియర్ మేనేజర్ శిరీష, 'ఆంధ్రజ్యోతి' న్యూస్ ఎడిటర్ నాగసుధాకర్, 'ఆంధ్రజ్యోతి' విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ, ఏబీఎన్ ఏపీ బ్యూరో బి.రామారావు, యాడ్స్ ఏజీఎం టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, మల్లెల శుభప్రద వ్యవహరించారు. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

ప్రథమ బహుమతి గెలుచుకున్న విజయనగరం జిల్లా మహిళ

గుంటూరు, అనంతపురం, తమిళనాడు మహిళలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



పరిశీలన : ముగ్గులను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

రెండుసార్లు రాష్ట్రస్థాయి బహుమతి పొందా..



నేను టైలరింగ్ చేస్తాను. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నప్పటి నుంచీ పాల్గొంటున్నా. హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించాను. తర్వాత 2023లో నిర్వహించిన పోటీల్లో రెండోసారి ప్రథమ బహుమతిని పొందాను. మళ్లీ ఇప్పుడు ద్వితీయ బహుమతి పొందా.

- కె.ఉమాదేవి, అనంతపురం జిల్లా

ద్వితీయ బహుమతి విజేతలు

ఐదేళ్లుగా ముగ్గులు వేస్తున్నా



మాది సత్తెనపల్లి వద్ద ఉన్న ధూళిపాళ్ల గ్రామం. ఐదేళ్లుగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. జిల్లాస్థాయి పోటీల్లో రెండుసార్లు ప్రథమ బహుమతి సాధించాను. 2020లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లోనూ మొదటి స్థానం నాదే.

- ఏ.సునీత, గుంటూరు జిల్లా

పదేళ్లుగా పోటీల్లో ఉంటున్నా..



కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో ఏటా నేను పాల్గొంటా. పదేళ్లుగా నేను ముగ్గులు వేస్తున్నా. తొలిసారిగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఈ పోటీల్లో ద్వితీయ బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది.

- రాధ, తమిళనాడు



విజేతలు వీరే..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నుంచి ద్వితీయ బహుమతులు అందుకుంటున్న ఏ.సునీత (గుంటూరు), కె.ఉమాదేవి (అనంతపురం), కె.రాధ (తమిళనాడు), కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న ఆర్.ఆశాజ్యోతి (శ్రీకాకుళం), బి.లక్ష్మి (విశాఖపట్నం), టి.ఆదిశ్రీ (పశ్చిమగోదావరి), మల్లీశ్వరి (తూర్పుగోదావరి), పి.పూజిత (కృష్ణా), ఎం.సునీత (నెల్లూరు), సీహెచ్ మణిమంజరి (ప్రకాశం), విద్య (చిత్తూరు), ఎస్.శ్వేత (కడప), ఎస్.రాజేశ్వరి (కర్నూలు), లిఖిత (కర్ణాటక)

యువతిని ప్రేమించి మోసగించిన కేసులో 15 ఏళ్ల జైలు

గండేపల్లి, జనవరి 11: యువతిని ప్రేమించానని చెప్పి మానసికంగా, శారీరకంగా మోసగించిన వ్యక్తికి రాజమండ్రి 8వ అడిషనల్ స్పెషల్ జడ్జి వై.చెన్నయ్యనాయుడు 15 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధించినట్లు గండేపల్లి ఎస్ఐ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలో యర్రంపాలెం గ్రామానికి చెందిన 29 ఏళ్ల బండి దుర్గాప్రసాద్ ఓ అమ్మాయిని ప్రేమించానని నమ్మించి మోసం చేయడంతో ఆమె అక్టోబరు 8, 2020లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ శోభన్‌కుమార్ కేసు నమోదు చేయగా సీఐ సురేష్ బాబు దర్యాప్తు చేశారు. వాదోపవాదనలు పూర్తయిన తర్వాత గురువారం జడ్జి తీర్పు వెలువరించారు.

హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా మేడపాటి షర్మిళారెడ్డి



రాజమహేంద్రవరం, జనవరి11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా రుడా మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిళారెడ్డి నియమితులయ్యారు. ఇటీవల రుడా చైర్‌పర్సన్‌గా ఆమెను కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇచ్చిన రెండో రోజునే వాటిని రద్దు చేసిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఎంపీ మార్గాని భరత్‌రామ్ పట్టుపట్టి మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావుకు రుడా పదవి వచ్చేటట్టు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో అనూహ్యంగా ఆమెకు హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పదవి దక్కింది. ఉత్తర్వులు స్వయంగా తీసుకుని షర్మిళారెడ్డి, ఆమె భర్త అనిల్‌రెడ్డి బయలుదేరినట్టు చెప్పారు.

హరిహర సదన్‌కు రూ.5 లక్షలు



ఆలయ పీఆర్వోకు విరాళం అందిస్తున్న దాతలు

అన్నవరం, జనవరి 11: అన్నవరం దేవస్థానంలో సత్యగిరి కొండపై నిర్మితమైన హరిహర సదన్ కాటేజీకి గురువారం ఒక దాత రూ.5 లక్షలు విరాళంగా సమర్పించారు. నెల్లూరు జిల్లా కమ్మపాలెంనకు చెందిన బెల్లం జయసందీప్ ఈ మొత్తాన్ని ఆలయ పీఆర్వో కృష్ణారావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఆయన అభినందించి వారికి స్వామి వారి ప్రత్యేక దర్శనం ప్రసాదాలు అందజేశారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



కాజులూరు, జనవరి 11: కాజులూరు శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఆకుల లక్ష్మణరావు(38) ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. గ్రామానికి చెందిన సలాది రాంబాబు ఇంట్లో డ్రిల్లింగ్ మిషన్‌తో పనిచేస్తుండగా విద్యుత్ ప్రమాదానికి గురయ్యాడు. ఆసుపత్రికి తరలించేలోపే లక్ష్మణరావు చనిపోయాడు. లక్ష్మణరావు జనసేన కార్యకర్తగా ఉన్నాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. లక్ష్మణరావు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విరవాడలో దారుణహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పిఠాపురం రూరల్, జనవరి 11: పిఠాపురం మండలం విరవాడలో వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. ఈ సంఘటన స్థానికంగా సంచలనం కలిగించింది. తుని మండలం హంసవరం గ్రామానికి చెందిన సిద్ధాంతపు అప్పారావు విరవాడలోని ఇటుకల బట్టీలో పనిచేస్తున్నాడు. అక్కడ భార్య చిన్నారి, ఇద్దరు పిల్లలతో కలిసి నాలుగేళ్లుగా నివాసముంటున్నాడు. ఇంట్లో అప్పారావు నిద్రిస్తుండగా గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామానికి చెందిన సురేష్ అనే వ్యక్తి కత్తితో విచక్షణారహితంగా నరికి హత్య చేశాడు. భార్య కేకలు వేయడంతో సురేష్ అక్కడి నుంచి పరారయ్యాడు. కాగా అప్పా రావు, సురేష్‌కు గతంలో ఖమ్మంలో ఇటుక బట్టీలో కలిసి పనిచేసే సమయంలో పరిచయం ఏర్ప డింది. వీరిద్దరికి గతంలో పలుమార్లు గొడవలు జరిగినట్లు చెబుతున్నారు. ఒక మహిళతో సంబంధం నేపథ్యంలో ఈ హత్య జరిగిందని సమాచారం. సంఘటనా స్థలాన్ని పిఠాపురం సీఐ శ్రీనివాస్, రూరల్ ఎస్ఐ గుణశేఖర్ పరిశీలించారు.



అప్పారావు(ఫైల్)

శ్రీప్రకాష్‌లో సంక్రాంతి సంబరాలు



సంప్రదాయ వస్త్రధారణతో చిన్నారులు

పెద్దాపురం, జనవరి 10: స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు గురువారం ఘనంగా జరిగాయి. సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలతో పాఠశాలలో సందడి చేశారు. భోగి మంటలు, డూడూ బసవన్నల ఆటలు, బొమ్మల కొలువులు, పతంగులు, రంగురంగుల రంగవల్లులు, జంగమదేవరలు, హరిదాసుల కీర్తనలు, తొక్కుడు బిళ్ల, దూదూపుల్ల ఆటలతో పల్లె వాతావరణం తలపించేలా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. దీంతో పాఠశాల ప్రాంగణం అంతా పండుగ వాతావరణాన్ని తలపించింది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించేందుకు తమ పాఠశాలలో ప్రతి సంవత్సరం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. అలాగే వంటింటి మహారాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. పాఠశాల సీని యర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, ప్రొఫెసర్ సంతానం, సమీర, మేనేజర్ రామకృష్ణ, ఆకడమిక్, కల్చరల్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.



విజయ్‌ప్రకాష్‌తో బాలిక సరదా ముచ్చట

800 అడుగుల భోగి దండ



భోగి దండతో కుటుంబ సభ్యులు

అమలాపురం రూరల్, జనవరి 11: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సమనస పంచాయతీ పరిధిలోని రంగాపురానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు భూపతిరాజు విశ్వనాథరాజు కోడలు శ్రీరామసత్య దేశీయ ఆవుపేడతో 800 అడుగుల భోగి పిడకల దండ తయారు చేసింది. పిల్లలు మౌక్తిక, కార్తీక సహకారంతో 15 వేల భోగి పిడకలతో దండను రూపొందించింది.

జగన్‌ను దళితులే ఓడిస్తారు

అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్



మాట్లాడుతున్న హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 11: అధికారాన్ని ఇచ్చిన దళితులే ముఖ్యమంత్రి జగన్‌ను రాబోయే ఎన్నికల్లో చిత్తుగా ఓడించి గద్దె దించబోతున్నారని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. రాజమహేంద్రవరం రాజీవ్ గాంధీ విద్యాసంస్థల్లో గురువారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో జగన్ అధికారంలోకి వచ్చాక దళితుల జీవితాలు బాగుపడతాయని ఆశించిన వారి ఆశలపై నీళ్లు చల్లాడన్నారు. దళితులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు వంటివి అధిక మయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత యువకులను కొట్టిచంపితే రూ.10 లక్షలు ఇచ్చి సెటిల్ చేసుకోవడం, అత్యాచారం చేసి చంపితే నిందితులను అరెస్టులు చేయకుండా అడ్డుపడడం, ఇద్దరు దళిత యువకులకు శిరోముండనం చేస్తే చర్యలు తీసుకోకపోవడం, డాక్టర్ సుధాకర్‌ను దారుణంగా ఇబ్బందులకు గురిచేసి అతను చనిపోవడానికి కారణం కావడం ఇలా అనేక సంఘటనలు ఉన్నాయన్నారు. అందుకే దళితులంతా ఏ ఓటుతో జగన్‌ను సీఎం చేశారో అదే ఓటు తో కిందకు దించబోతున్నారని చెప్పారు. వచ్చే నెల 8న రాజమహేంద్రవరం బొమ్మూరులో దళిత సింహగర్జన నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సభ ద్వారా దళితుల సత్తా ఏమిటో చూపిస్తామన్నారు. అమలాపురం నుంచి తాను ఎంపీగా పోటీ చేస్తున్నానని చెప్పారు. సమావేశంలో జీవీ శ్రీరాజ్, యర్రా రామకృష్ణ పాల్గొన్నారు.

తల్లి ఒడికి చేరిన చిన్నారి

తల్లిని గుర్తించి క్షేమంగా అప్పగించిన పోలీసులు



చిన్నారిని తల్లికి అప్పగిస్తున్న సీఐ విజయ్ శంకర్

రాజమహేంద్రవరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రైల్వే పోలీసుల(జీఆర్పీ) ప్రత్యేక చొరవతో తల్లి నుంచి దూరమైన చిన్నారిని నెలన్నరలో తిరిగి ఆమె ఒడికి చేర్చారు. జీఆర్పీ సీఐ విజయ్ శంకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గతేడాది నవంబరు 18న రాజమండ్రి రైల్వే స్టేషనులోని ఏడాదిన్నర పసిపాప ఒంటరిగా ఏడుస్తోందంటూ డ్యూటీలో ఉన్న ఆర్పీహెచ్‌సీ ఎస్వీవీ సత్యనారాయణకు చెప్పారు. ఆయన ఏఆర్ఎస్ఐ ఎస్.సత్యనారాయణతో హుటాహుటిన వెళ్లి పాపను సంరక్షించి వివరాల కోసం వాకబు చేయగా ఫలితం లేకపోయింది. దీంతో కేసు నమోదు చేసి.. చైల్డ్ వెల్ఫేర్ వాళ్లకు సమాచారమివ్వగా వాళ్లు పాపను తీసుకెళ్లారు. సీఐ విజయ్ శంకర్ పర్యవేక్షణలో ఆర్పీ ఎస్ఐ పి.లోవరాజు, ఆర్పీ ఎస్ఐ కె.మావుళ్లు కేసు దర్యాప్తు చేపట్టారు. మీడియా, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారాన్ని కల్పించారు. ఇన్‌స్టాగ్రాంలో చూసిన పాప బంధువు ఒకరు కాట్రేనికోన మండలం కొత్తపాలెంకి చెందిన పాప తల్లి ఓలేటి కావేరికి విషయాన్ని చేరవేశారు. దీంతో ఆమె జీఆర్పీ పోలీసులను గురువారం ఆశ్రయించగా పాపను అప్పగించారు. ఆ రోజున తల్లి ఇంటికి బయలుదేరి పాప తినడానికి ఏదైనా తీసుకురావడానికి స్టేషను బయటకు వెళ్లగా మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో ఆమె కళ్లు తిరిగి పడిపోయిందని.. తర్వాత వచ్చి చూడగా పాప కనబడకపోవడంతో అప్పటి నుంచీ వాళ్లు వెతుకుతున్నారని సీఐ చెప్పారు. కేసులో ప్రతిభ చూపిన సీఐ విజయ్ శంకర్, ఎస్ఐలు మావుళ్లు, లోవరాజు ఇతర సిబ్బందికి రైల్వే పోలీసు ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్, రైల్వే డీఎస్పీ బీవీఎస్ నాగేశ్వరరావు ప్రశంసించారు.

సోదరుడి హత్య కేసులో ఏడేళ్ల జైలు

రాజవొమ్మంగి జనవరి 11: తన సోదరుడిని తలపై కొట్టి చంపిన ఘటనలో నిందితుడికి గురువారం ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. జడ్డంగి ఎస్ఐ రఘునాథరావు తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని కొమరాపురం గ్రామానికి చెందిన మార్తి వేంకటేశ్వరులు(60) ఇంటి స్థలాల విషయంలో తన తమ్ముడు తాతారావుతో ఘర్షణ పడి, కర్రతో తన తమ్ముడిని తలపై కొట్టడం వల్ల తాతారావు చనిపోయాడు. 2021లో జరిగిన ఈ ఘటనపై అప్పటి సీఐ నాగదుర్గారావు కేసు నమోదు చేసి వేంకటేశ్వరులుని అరెస్టు చేయగా, వేంకటేశ్వరులు బెయిల్‌పై బయటకు వచ్చి కోర్టు విచారణకు హాజరుకాకుండా తప్పించుకుని తిరుగుతుండడంతో జడ్డంగి ఎస్ఐ రఘునాథరావు అరెస్టు చేసి జైలుకు పంపారు. రాజమండ్రి కోర్టులో గురువారం వేంకటేశ్వరులుకు ఏడేళ్లశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించినట్లు జడ్డంగి ఎస్ఐ రఘునాథరావు తెలిపారు.






80 ఏళ్లు పైబడిన సీనియర్ పెన్షనర్లను సన్మానిస్తున్న అధికారులు, సహచరులు

ఫిబ్రవరి నెలాఖరులోగా
లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

అసిస్టెంట్ సబ్ ట్రెజరీ అధికారి రంగారావు

అమలాపురం రూరల్, జనవరి 11: పెన్షనర్లు ఫిబ్రవరి నెలాఖరులోగా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో సమర్పించాలని అసిస్టెంట్ సబ్ ట్రెజరీ ఆఫీసర్ బీవీవీఎస్ఎస్ రంగారావు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కోనసీమ జిల్లా శాఖ చేస్తున్న సేవలు ఎందరికో ఆదర్శంగా నిలుస్తాయన్నారు. పెన్షనర్స్ కార్యాలయంలో ఆన్‌లైన్ ఇంటర్నెట్‌తో ఉచితంగా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్స్ అందించే ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. గత ఏడాది 800 మంది పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్లు ఉచితంగా అందజేసిన ఘనత వీరికే దక్కుతుందన్నారు. కొంకాపల్లి శివారు ఏవీఆర్ నగర్‌లోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ కార్యాలయ భవనంపై నూతనంగా నిర్మిం చిన వివిధ విభాగాలను ఏటీవో రంగారావు, దాతలు యల్లమిల్లి పాండు రంగారావు, కూచిమంచి నాగమణి, రిటైర్డ్ ఎంప్లాయీస్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎస్ఎన్ రాజు, సీనియర్ పెన్షనర్ ఐవీ శ్రీనివాసరావు, విశ్రాంత ఎస్ఐ కేఎస్వీ సత్యనారాయణ ప్రారంభించారు. అనంతరం డీఎస్ నకరా చిత్రపటా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లాశాఖ అధ్యక్షుడు పి.కృష్ణశాస్త్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రధాన కార్యదర్శి కేకేవీ నాయుడు మాట్లాడుతూ రూ.18లక్షల వ్యయంతో అదనపు గదులు నిర్మించామన్నారు. మరో ముఖ్య అతిథి, డీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షనర్ల పట్ల అనుసరిస్తున్న విధానాలు మార్చుకోవాలన్నారు. అనంతరం 1941-43 మధ్య జన్మించిన సీనియర్ సిటిజన్లు 18 మందిని ఎస్వీఎస్ఎస్ సీహెచ్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అయా కార్యక్రమాల్లో ఎస్టీవో ఎం.వెంకటనారాయణ, కోశాధికారి జయంతి సోమేశ్వరశర్మ, అసోసియేట్ అధ్యక్షుడు ఎం.సాయివరప్రసాదరావు, ఉపాధ్యక్షులు ఎం.అప్పారావు, టీవీ శర్మ, చిక్కం సూర్యనారాయణ, కలిగినీడి బేబి, మంగిపూడి శ్రీరామచంద్రమూర్తి, ఏఎస్ఎస్ ప్రకాశం, కుమార్, కలిగినీడి ఉదయభాస్కర్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

21న సైన్స్ ఎగ్జిబిషన్

అమలాపురం టౌన్, జనవరి 11: బాలికల్లో వైజ్ఞానిక దృక్పథాన్ని, విద్యను ప్రోత్సహించేందుకు ఆరేళ్లుగా రేవతి సైన్స్ ఫౌండేషన్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని డీఈవో ఎం.కమలకుమారి పేర్కొన్నారు. ఈ నెల 24న బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన గోడ పత్రికను కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో గురువారం ఆమె ఆవిష్కరించారు. రేవతి సైన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న రామచంద్రపురంలో బాలికా దినోత్సవ ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. అదే రోజున 5వ తరగతి నుంచి డిగ్రీ విద్యార్థులకు సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామన్నారు. 'ప్రకృతి విజ్ఞానం-శాస్త్రవేత్తలు' అంశంపై పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, ఫౌండేషన్ అధ్యక్షుడు కె.కృష్ణసాయి, రామానుజన్ గణిత అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ కేవీపీ సత్యనారాయణ, గణితావధాని టీఎస్‌వీఎస్ సూర్యనారాయణమూర్తి, కుంచే బాలకృష్ణ పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.1.59లక్షలు

ఆత్రేయపురం, జనవరి 11: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామిని గురువారం వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1.59 లక్షలు లభించినట్లు ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.





కొత్తపేట మండలం వాడపాలెంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బందారు, అల్లవరం సదస్సులో మాట్లాడుతున్న అయితాబత్తుల ఆనందరావు

ఒక్క చాన్స్ జగన్ ప్రభుత్వానికి కాలం చెల్లింది

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందారు సత్యానందరావు

'జయహో బీసీ' ర్యాలిని విజయవంతం చేయాలి: గొల్లపల్లి సూర్యారావు

కొత్తపేట, జనవరి 11: ఒక్క ఛాన్సంటూ అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వానికి కాలం చెల్లిందని, ఇంటికి పంపించేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందారు సత్యానందరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని వాడపాలెంలో జరిగిన టీడీపీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో రాక్షసత్వం రాజ్యమేలుతుందన్నారు. రా... కదలిరాతో ప్రజలను చైతన్యపరిచింది ఆనాడు ఎన్టీఆర్ అయితే నేడు చంద్రబాబునాయుడన్నారు. సీపీఎస్‌ను రద్దు చేస్తానని చెప్పి ఉద్యోగుల గొంతు కోశారన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు కంఠంశెట్టి శ్రీనివాసరావు, ముత్యాల బాబ్జి, యల్లమిల్లి జగన్మోహన్, కప్పల సునీల్, కాసా సాగర్, బందారు వీరబాబు, చీకరమిల్లి లోవరాజు, జల్లి వెంకట్రావు, జల్లి నూరిబాబు, చిక్కం హనుమంతు పాల్గొన్నారు.

అల్లవరం,: బీసీలను వైసీపీ ప్రభుత్వం అణగదొక్కిందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు ఆరోపించారు. టీడీపీ మండల అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు ఆధ్వర్యంలో అల్లవరంలో 'జయహో బీసీ' సదస్సు జరిగింది. పార్టీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, రాష్ట్ర శెట్టిబలిజ సాధికార డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, కొల్లు విష్ణుమూర్తి, నార్గన శ్రీనివాసరావు, మల్లుల పొలయ్య, గుబ్బల నాగేశ్వరరావు, అర్.భీముడు, దొమ్మేటి సత్యనారాయణ, గుత్తుల నాగేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం బీసీ నాయకులు ఓడలరేవుతో పాటు పలు గ్రామాల్లో పర్యటించి టీడీపీకి అండగా నిలవాలని ప్రచారం చేశారు.

మలికిపురం: మండలంలో 'జయహో బీసీ' ర్యాలీని విజయవంతం చేయాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పిలుపునిచ్చారు. గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం ఉదయం పది గంటలకు విశ్వేశ్వరాయపురంలో ప్రారంభమయ్యే ర్యాలీ లక్కవరం, ఇరుసుమండ, గుబ్బలపాలెం, అడివిపాలెం, బట్టేలంక, కత్తిమండ మీదుగా మలికిపురం చేరుకుంటుందని తెలిపారు. చెల్లింగి సత్యనారాయణ, అడబాల సాయిబాబా, ఎంపీపీ కేతా శ్రీనివాస్, అడబాల యుగంధర్, బొక్కా గోవిందు, రుద్రరాజు బంగారాజు, కొమ్మోజు హరీష్, చిట్టూరి సంతోష్, గుబ్బల విక్రమ్, బొక్కా గోవిందు, కడలి కిశోర్ పాల్గొన్నారు.

మామిడికుదురు: మామిడికుదురులో ఈ నెల 19న జరిగే 'జయహో బీసీ' సమావేశాన్ని విజయవంతం చేయాలని టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్ కోరారు. గురువారం పాశర్లపూడిలో ఈ మేరకు సన్నాహక సమావేశం నిర్వహించారు. బీసీ సెల్ మండల అధ్యక్షుడు కడలి నూకరాజు, కోలా రాంబాబు, కొల్లు ఏడుకొండలు, మానేపల్లి రామకృష్ణ, మల్లాడి విష్ణు, వాసంశెట్టి శంకరరావు, పాటి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: 'రా..కదలిరా' కార్యక్రమం ద్వారా నాడు ఎన్టీఆర్, నేడు చంద్రబాబు ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నారని ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ముమ్మిడివరం అసెంబ్లీ ఇన్‌చార్జి దాట్ల బుచ్చిబాబు అన్నారు. మురమళ్లలోని టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ఎక్కడ బహిరంగ సభ పెట్టినా జనం పోటెత్తుతున్నారన్నారు. ఒక్క ఛాన్స్ ప్లీజ్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వానికి కాలం చెల్లిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఇప్పటివరకు ఒక్క రోడ్డు కూడా వేసిన దాఖలాలు లేవన్నారు.


మలికిపురంలో మాట్లాడుతున్న గొల్లపల్లి సూర్యారావు

రాజోలు: కాపులకు ఉపకారం చేసింది టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు అయితే అపకారం చేసింది మాత్రం ముఖ్యమంత్రి జగనే అని డాక్టర్ వైఎస్సార్ హార్టీకల్చర్ యూనివర్శిటీ మాజీ డైరెక్టర్ బోనం నాగేశ్వరరావు తీవ్రంగా విమర్శించారు. గురువారం ఆయన తాటిపాకలో విలేకరులతో మాట్లాడుతూ బయటకు చెప్పుకోలేని బాధలతో నలిగిపోతున్న కాపులకు చట్టపరంగా ప్రత్యేక రిజర్వేషన్‌ను చంద్రబాబు కల్పించారన్నారు. కనీసం ఐదు శాతం కూడా అమలు జరపకుండా కాపులకు జగన్ తీరని అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. సీఎం జగన్ ఎన్ని ఎత్తులు, పై ఎత్తులు వేసినా 90శాతం మంది కాపులు టీడీపీ, జనసేన పార్టీలతోనే ఉంటారని బోనం తెలిపారు. సమావేశంలో కాపు నాయకులు మేడిచర్ల సుబ్బారావు, సూదా బాబ్జీ, యెరుబండి లక్ష్యయ్య, ఈలి శ్రీనివాస్, గుండాబత్తుల తాతాజీ, తుమ్మలపల్లి నారాయణ, గుద్దటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాట్రేనికోన, జనవరి 11: కాట్రేనికోన, చెయ్యేరు విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. కాట్రేనికోన, గెద్దనపల్లి, కుండలేశ్వరం, జీకే పొర, వేట్లపాలెం, చిర్రయానాం, దొంతికుర్రు, కొప్పిగుంట, పల్లం, కందికుప్ప, పల్లంకుర్రు, బలుసుతిప్ప, చెయ్యేరు, చెయ్యేరు అగ్రహారం, పెనుమల్లె, లక్ష్మీవాడ, ఉప్పూడి, సావరం గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ముమ్మిడివరం: ముమ్మిడివరం 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. మండలంలోని అయినాపురం, అనాతవరం, కొత్తలంక, ఠాణేలంక, ముమ్మిడివరం ఎంహెచ్‌క్యూ-1, ముమ్మిడివరం ఎంహెచ్‌క్యూ-2, ఆర్‌డబ్ల్యుఎస్ ఫీడర్లపై ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

ఉప్పలగుప్తం: ఉప్పలగుప్తం, చల్లపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో శుక్రవారం ఉదయం లైన్ల నిర్వహణ, చెట్లు కొమ్మల నరికివేత పనులు చేపట్టనున్నట్టు ఈఈ ఎం.రవికుమార్, ఏఈ శ్రీహరి తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.



వెటర్నరీ డైరీ ఆవిష్కరణ

ఆలమూరు, జనవరి 11: ఏపీ వెటర్నరీ నాన్ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ 2024 డైరీని తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల పశువైద్యాధికారులు గురువారం ఆవిష్కరించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు ఈదల శ్రీనివాస్ అధ్వర్యంలో ఆయా జిల్లా కేంద్రాల్లో కోనసీమ జేడీ కె.వెంకట్రావు, కాకినాడ జిల్లా జేడీ కె.సూర్యప్రకాష్, తూర్పుగోదావరి జిల్లా జేడీ సత్యగోవింద్ ఆవిష్కరించి ఆయా జిల్లాల అధికారులకు అందజేశారు. డీడీ జి.శ్రీనివాస్, యూనియన్ నాయకులు కె.రామారావు, బి.సాంబమూర్తి, కేవీ రామరాజు, ఎం.అక్కినాయుడు, ఎస్.వెంకటేశ్వరరావు, కొల్లి విజయబాబు, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె తాత్కాలిక ముగింపు

ముమ్మిడివరం, జనవరి 11: ముమ్మిడివరంలోని జిల్లా విద్యా శాఖ కార్యాలయం ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగులు 22 రోజులుగా చేస్తున్న సమ్మెను గురువారం తాత్కాలికంగా ముగించినట్టు జేఏసీ అధ్యక్షుడు సీహెచ్ వెంకన్నబాబు తెలిపారు. కొన్ని డిమాండ్లను అంగీకరిస్తున్నట్టు బొత్స సత్యనారాయణ హామీ ఇవ్వడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. హెచ్ఆర్‌కు సంబంధించిన జీవోను తక్షణం విడుదల చేయాలని, లేనిపక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని ఆయన చెప్పారు

2,800 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

ఆలమూరు, జనవరి 11: మండలంలోని జొన్నాడ వద్ద వ్యాన్‌పై తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గురువారం పట్టుకున్నారు. ఏలూరుకు చెందిన కడలి లక్ష్మణ్ రాజానగరంలోని ఒక కోళ్ల ఫారానికి వ్యానులో బియ్యం తరలిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు దాడి చేశారు. 2,800 కిలోల బియ్యాన్ని పట్టుకుని ఆలమూరు పోలీసులకు అప్పగించారు. దాని విలువ రూ.8,27,400గా నిర్ధారించారు. దాడిలో రీజనల్ విజిలెన్స్ ఇన్‌చార్జి అధికారి ఎ.సురేష్‌బాబు, ఎస్ఐ జగన్నాథరెడ్డి, కానిస్టేబుల్ వలీ, వీరబాబు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆలమూరు పోలీసులు చెప్పారు.

టీడీపీ హయాంలోనే బీసీలకు సముచిత స్థానం

అంతర్వేది, జనవరి 11: టీడీపీ ప్రభుత్వ హయాంలోనే బీసీలకు సముచిత స్థానం ఉంటుందని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. సఖినేటిపల్లి మండలం అంతర్వేది దేవస్థానం గ్రామంలో జయహో బీసీ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. కార్యకర్తలతో కలిసి లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్న అనంతరం ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యకర్తలతో కలిసి ర్యాలీగా గొంది, గుడిమూల, రామేశ్వరం, సఖినేటిపల్లి గ్రామాల మీదుగా అంతర్వేదిపాలెం చేరుకున్నారు. కార్యక్రమంలో రాజోలు ఎంపీపీ కేతా శ్రీనివాస్, గుబ్బల శ్రీనివాస్, కౌరు శ్రీనివాస్, అంతర్వేదిపాలెం పుల్లయ్య, వనమాలి మూలాస్వామి, తిరుమాని ఆచార్యులు, కొల్లు రాము, చెల్లింగి లీలాశ్రీనివాస్, కడలి వెంకటరత్నం, మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

అంతర్వేది, జనవరి 11: మలికిపురం ఎంవీఎన్‌జేఎస్-ఆర్‌వీఆర్ డిగ్రీ కళాశాల 1986-89 బ్యాచ్ బీఏ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అంతర్వేది యాపిల్ రిసార్ట్స్ సముద్ర తీరం వద్ద ఉత్సాహంగా జరిగింది. ఉద్యోగాలు చేస్తూ దేశం నలుమూలలా స్థిరపడిన వారంతా ఒకచోట కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. బీచ్‌లో ఉల్లాసభరితంగా సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం విద్యాభ్యాసానికి, ఆర్థిక ఇబ్బందులు, ఆటంకం కలగకుండా ఉండేందుకు వకుళశ్రీ భర్త సోమశేఖర్ దాతృత్వంలో ముగ్గురు విద్యార్థులకు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో షేక్ బాబ్జీ, దేవ రాజేంద్రప్రసాద్, రాపాక పెద్దిరాజు, యాలంగి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

పి.గన్నవరం, జనవరి 11: రాజవరం-పొదలాడ ప్రధాన రహదారిలో మొండెపులంక వద్ద జరిగిన ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు. మొండెపులంక గ్రామానికి చెందిన ఎస్.శశిప్రీతమ్ ద్విచక్ర వాహనంపై గన్నవరం వైపు తిరుగుతుండగా ఎదురుగా ద్విచక్ర వాహనంపై వస్తున్న నరసాపురానికి చెందిన టి.వెంకటేశ్వర్లు, టి.రామకృష్ణ అదుపుతప్పి ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడిన ముగ్గురినీ పి.గన్నవరం సీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యులు సూచన మేరకు మెరుగైన చికిత్సకై అమలాపురం తరలించారు. శశిప్రీతమ్ తలకు బలమైన గాయం కావడంతో కాకినాడ తీసుకెళ్లినట్టు సమాచారం.

కుట్టుమిషన్లు పంపిణీ

పి.గన్నవరం, జనవరి 11: సహృదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏకం (యూఎస్ఏ) ఆర్థిక సహాయంతో మూడు కుట్టమిషన్లు వితంతువులకు, దివ్యాంగులకి సైకిల్‌ను ముఖ్య అతిథులుగా విచ్చేసిన సర్పంచ్ బొండాడ నాగమణి, ఎస్ఐ జి.హరికోటి శాస్త్రి అందజేశారు. సంస్థ ఫౌండర్ పైడి రాజేష్, సభ్యులు దిరుసుమర్తి సతీష్, యర్రంశెట్టి భాస్కర్, యర్రంశెట్టి సురేష్, బందారు సాయి, పైడి సురేష్, గాడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భోగి రోజున బీచ్‌లో గాలిపటాల పండుగ

అల్లవరం, జనవరి 11: భోగి పండుగ రోజున ఓడలరేవు సముద్ర తీరంలో భారీ గాలి పటాల పండుగ నిర్వహిస్తామని తాడి ధర్మారావు, సోమాని వెంకటరమణ, కమిటీ సభ్యులు తెలిపారు. దీనిని విజయవంతం చేయాలని వారు కోరారు.

పెట్రోల్ బంకుల డీలర్ల నిరసన

అమలాపురం టౌన్, జనవరి 11: పుదుచ్చేరి యానాం నుంచి పెట్రోల్‌తో పాటు డీజిల్‌ను అక్రమంగా రవాణా చేస్తూ విక్రయాలు జరుపుతుండడంతో జిల్లాలో పెట్రోలు బంకులకు నష్టాలు తప్పట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ బంకుల డీలర్లు గురువారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. యానాంలో లీటరు పెట్రోల్‌కు రూ.15, డీజిల్‌కు రూ.14 ధరల్లో వ్యత్యాసం ఉండడం వల్ల యానాం నుంచి అక్రమంగా జిల్లాలోకి రవాణా చేస్తూ విక్రయిస్తున్న తీరువల్ల జరుపుతున్న నష్టాలను వివరించారు. జిల్లాలో కన్స్యూమర్స్ బంకులకు సంబంధించి ఒక ముఠా యథేచ్ఛగా యానాం నుంచి అక్రమ ఆయిల్ తీసుకువచ్చి విక్రయాలు జరుపుతోందని ఆరోపించారు. సొసైటీకి సొంతంగా వాడుకునేందుకు కన్స్యూమర్ బంకులో డీజిల్‌కు మాత్రమే అనుమతి ఉన్నప్పటికీ పెట్రోల్, డీజిల్‌లను రిటైల్ సేల్స్ జరుపుతున్నారన్నారు. ఇటీవలి కాలంలో యానాం నుంచి జరుగుతున్న అక్రమ రవాణాలపై కేసులు నమోదయ్యాయని వివరించారు. ప్రధాన వంతెనల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి అక్రమ రవాణాను అడ్డుకోవాలన్నారు. అక్రమ ఆయిల్ ముఠా మీద పెట్టిన కేసులో ప్రధాన సూత్రధారులను వెంటనే అరెస్టుచేసి పెట్రోల్ బంకుల డీలర్లను కాపాడాలని కోరారు. అక్రమ రవాణా వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే టాక్సుకు కూడా గండి పడుతున్న విషయాన్ని గుర్తించాలన్నారు. కలెక్టర్ కార్యాల యంలో వినతిపత్రం అందించిన వారిలో జీవీ సుధీర్‌కుమార్ రాజు, జవ్వాది తాతబాబు, సూరిబాబు, దాసరి రత్నాకర్, గంధం తిరుమలరావు, రామకృష్ణ, దొరబాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

పోలిశెట్టి ట్రస్టు ద్వారా నిత్యావసరాలు పంపిణీ

కె.గంగవరం, జనవరి 11: పోలిశెట్టి లక్ష్మీ మెమోరియల్ చారిటబుల్ ఫౌండేషన్ ద్వారా పవన్‌కల్యాణ్ స్ఫూర్తితో డొక్కా సీతమ్మ ఆసరా పథకం ద్వారా పేద కుటుంబాలకు నిత్యావసరాలు అందజేయడం ఆనందంగా ఉందని ఆ ట్రస్టు చైర్మన్, జనసేన రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని గంగవరం, తామరపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఇటీవల మృతి చెందిన బొమ్ము ప్రసాద్, పొలినాటి కొటయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి నిత్యావసర సరకులు అందజేశారు. జనసేన జిల్లా కార్యదర్శి సంపత్, మండల శాఖ అధ్యక్షుడు చిర్రా రాజ్‌కుమార్, ముంగి రమేష్‌బాబు, జన సైనికులు పాల్గొన్నారు.

20వేల పశువులకు గాలికుంటు వ్యాధి వ్యాక్సిన్

ఆలమూరు, జనవరి 11: పశువులకు వచ్చే ప్రమాదకరమైన గాలికుంటు వ్యాధి నివారణకు దేశవ్యాప్తంగా జరుగుతున్న వ్యాక్సినేషన్‌లో భాగంగా ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాల్లోని 20వేల పశువులకు వ్యాక్సిన్ అందిస్తున్నట్టు ఆలమూరు వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్.అనిత తెలిపారు. ఆలమూరులో వ్యాక్సినేషన్‌ను గురువారం ఆమె సర్పంచ్ నాతి లావణ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ పశువుల కొట్టాల వద్దకే వెళ్లి వ్యాక్సిన్ అందించేందుకు 55 మంది సిబ్బందితో టీములు ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏడాది పశు బీమా చేయించుకునే వారిని రాయితీ ఇస్తున్నామని, రైతులు గమనించి బీమా చేయించుకోవాలని కోరారు.

రేషన్ షాపు తనిఖీ

కాట్రేనికోన, జనవరి 11: కందికుప్పలో రేషన్ షాపును ఆహార కమిటీ సభ్యుడు జక్కంపూడి కిరణ్ గురువారం తనిఖీ చేశారు. భారీగా బియ్యం నిల్వలను గుర్తించారు. అధికారుల తీరుపై మండిపడ్డారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: గుంటూరు కారం
వెంకటరమణ	: గుంటూరు కారం
శ్రీలలిత	: గుంటూరు కారం
శేఖర్ స్క్రీన్-1	: హనుమాన్
శేఖర్ స్క్రీన్-2	: ఆక్వామెన్
రమా	: గుంటూరు కారం
గణపతి	: ఎక్స్‌ట్రార్డనరీ
వెంకటపద్మావతిస్క్రీన్-1	: గుంటూరు కారం
వెంకటపద్మావతి స్క్రీన్-2	: సలార్

'ఆర్థిక బకాయిలు చెల్లించే వరకు పోరాటం'

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

అమలాపురం టౌన్, జనవరి 11: పోలీసుల నిర్బంధాల ద్వారా ఉద్యమాలను, పోరాటాలను అణచివేయలేరని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలను చెల్లించే వరకు పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు. అమలాపురం ఎంప్లాయీస్ హోంలో గురువారం జరిగిన జిల్లా శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 9, 10 తేదీల్లో విజయవాడలో చేపట్టిన 36 గంటల దీక్షను పోలీసులు భగ్నం చేయడం అప్రజాస్వామికమన్నారు. ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18,096 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. వారికి రావాల్సిన పీఎఫ్, ఏపీజీఎల్ఐ, పీఆర్సీ బకాయిలను తక్షణం చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని



నిరసిస్తూ ఈ నెల 14న ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను దహనం చేయాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎంటీవీ సుబ్బారావు, జిల్లా గౌరవాధ్యక్షుడు బేతినీడి శ్రీనివాసరావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు సురేంద్ర, కోశాధికారి కేశవరావు తదితరులు పాల్గొని మాట్లాడారు.

సంక్రాంతి సంబరాలు

అమలాపురం రూరల్/టౌన్, జనవరి 11: భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఓ వైపు సంక్రాంతి పిండి వంటల గుబాళింపు మరోవైపు గంగిరెద్దుల ఆటలు, కేరళ నృత్యాలు, డప్పువాయిద్యాలు, ఇంకోవైపు భోగిమంటలతో విద్యార్థినులు సందడి చేశారు. ముగ్గుల పోటీ ఆకట్టుకుంది. ఆయా పోటీల్లో విజేతలకు విద్యా సంస్థల చైర్మన్ బోనం కృష్ణసతీష్, డిప్లొమా ప్రిన్సిపాల్ ఫణిశంకర్, పరిపాలనాధికారి జక్కం వెంకటకృష్ణారావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు కరాటం రవిసుధీర్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అమలాపురం తులిప్స్ పబ్లిక్ స్కూలులో సంక్రాంతి సంబరాలు హోరెత్తాయి. డైరెక్టర్ నెల్లి రమేష్, ప్రిన్సిపాల్ నెల్లి సబిత ఉత్సవాలను ప్రారంభించారు. సంప్రదాయ వస్త్రధారణలతో హాజరైన విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో భోగిపండ్లు పోశారు. భోగిమంటలు వేసి ప్రభలను ఊరేగించారు.

కొత్తపేట: సంక్రాంతి సంబరాల్లో భాగంగా జనసేన కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బందారు శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం వాడపాలెంలో 'మన ఊరు.. మన ఆట' కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు రంగవల్లులతో పాటు పలు విభాగాల్లో ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులతో పాటు పాల్గొన్న వారందరికీ గిఫ్ట్ అందించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో జన సైనికులు పాల్గొన్నారు.


మండపేట: పట్టణంలోని ఎంపీఎస్ స్కూలులో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ అతిథులుగా హాజరయ్యారు. కరస్పాండెంట్ వల్లూరి చిన్నారావు నేతృత్వంలో చిన్నారులు వేషధారణలు, కోడిపందాలు, భోగి మంటలు, పిండి వంటలు ఆకట్టుకున్నాయి.

మామిడికుదురు: మామిడికుదురు దీప్తి కళాశాలలో సంక్రాంతి ముందస్తు సంబరాలు నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాల ప్రాంగణంలో భోగి మంటలు వేసి సందడి చేశారు. సంతూర్, విప్రో సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ డీవీవీ సత్యనారాయణ సంక్రాంతి విశిష్టతను వివరించారు. మోకా రంగారావు, సంతూర్, విప్రో ప్రతినిధులు కె.వెంకటేశ్వరరావు, డి.భవానీశ్రీనివాస్, పి.శ్రీరామ్ పాల్గొన్నారు.


రావులపాలెం: మా ఊరు.. మన ఆట కార్యక్రమంలో భాగంగా జనసేన కొత్తపేట నియోజవర్గ ఇన్‌చార్జి బందారు శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం ముగ్గుల పోటీ నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు వచ్చి అందమైన ముగ్గులు వేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు బహుమతులు అందజేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా మహిళా కో-ఆర్డినేటర్లు కడలి ఈశ్వరి, చల్లా లక్ష్మి, ముత్యాల జయలక్ష్మి, జనసేన మండల నాయకులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

రావులపాలెం: స్థానిక డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా భోగి మంటలు వేశారు. విద్యార్థుల సంప్రదాయ వస్త్రధారణ ఆకట్టుకుంది. ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. రీజనల్ జాయింట్ డైరెక్టర్ చప్పిడి కృష్ణ, వైస్ ప్రిన్సిపల్ పేరి సత్యమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రామచంద్రపురం: స్థానిక గోలి మంగాదేవి మోడరన్ హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. విద్యార్థుల విచిత్ర వేషధారణలు, డ్యాన్స్‌లతో పాఠశాల ప్రాంగణం మార్మోగింది. వ్యవస్థాపకుడు లయన్ జీవీ రావు, అకడమిక్ డైరెక్టర్ ఆర్.ఉమాదేవి, అకడమిక్ డైరెక్టర్ కె.సాయిరాంచౌదరి, ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయుడు ముత్యాల చిట్టిబాబు పాల్గొన్నారు.



టీడీపీ హయాంలోనే లంక గ్రామాల అభివృద్ధి



కపిలేశ్వరపురం, జనవరి 11: టీడీపీ ప్రభుత్వ హయాంలోనే కేదార్లంక, వీధివారిలంక, నారాయణలంక, పల్లపులంక, అద్దంకివారిలంక అభివృద్ధి చెందాయని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. గురువారం ఆయన మండలంలోని కేదార్లంక, వీధివారిలంకల్లో జనసేన నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వేగుళ్ళ లీలాకృష్ణతో కలిసి నిర్వహించిన 'బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ' కార్యక్రమంలో మాట్లాడారు. ఇద్దరూ గ్రామంలో ఇంటింటా పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రంకిరెడ్డి సత్యవతివెంకటేశ్వరరావు, వీధి ప్రసాద్, గవర వెంకటేశ్వరరావు, సాదా రవిభాస్కర్, ధనరాజ్, యర్రంశెట్టి తాతాజీ, శ్రీను, దూలం శ్రీనివాసరావు, అబ్బు, అన్యం సతీష్, బందారు ఈశ్వరరావు, అధిక సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు, జనసైనికులు, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.


మండపేటలో 31 సంఖ్య ఆకారంలో కూర్చుని నిరసన తెలుపుతున్న దృశ్యం

31 రోజుకు అంగన్‌వాడీల దీక్ష

ముమ్మిడివరం, జనవరి 11: అంగన్‌వాడీల సమ్మె 31వ రోజుకు చేరుకుంది. ముమ్మిడివరం సీడీపీవో కార్యాలయం ఎదుట దీక్షా శిబిరంలో తమ న్యాయమైన డిమాండ్లను తక్షణం పరిష్క రించాలని డిమాండు చేశారు. హెల్పర్లు గుత్తుల కల్పన, పండు సత్యనాగకుమారి సొమ్మసిల్లి పడిపోగా, మరో టీచరు డి.సత్యవతికి ఫిట్స్ రావడంతో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో ఒక హెల్పరుకు డెంగీ జ్వరం రాగా మరో ఆయా నీరసంతో సొమ్మసిల్లి పడిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. ప్రాజెక్టు అధ్యక్షురాలు దుర్గామహేశ్వరి, కార్యదర్శి ఎం.జయలక్ష్మి మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. అంగన్‌వాడీలు బెంగతో అనారోగ్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్.కనకదుర్గ, తలుపులమ్మ, యశోద, విజయ, ధనలక్ష్మి, సుబ్బలక్ష్మి, జి.మంగాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

మండపేట: అంగన్‌వాడీల సమ్మె 31వ రోజుకు చేరుకున్న నేపథ్యంలో మండపేటలోని దీక్షా శిబిరంలో ఉద్యోగులు 31 సంఖ్య ఆకారంలో కూర్చుని నిరసన తెలిపారు. జగనన్నా ఇదేమి న్యాయం అంటూ ఎండు మిరపకాయలతో అక్షరాలు రాసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి గేయాలు పాడారు.

మామిడికుదురు: మండలంలోని అంగన్‌వాడీలు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ప్రభుత్వం తమపై ఎస్మా చట్టం ప్రయోగిస్తోందన్నారు. జీవో నెం.2 రద్దు చేసి తమ న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలంటూ పాశర్లపూడి వైనతేయ నదిలో జలదీక్ష చేశారు. ముఖ్యమంత్రి జగన్‌కు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్‌వాడీలు, ఆయాలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పి.గన్నవరం: పి.గన్నవరం అక్విడెక్టు వద్ద వైనతేయ గోదావరి నదిలో అంగన్‌వాడీలు జలదీక్ష చేసి నిరసన తెలిపారు. అనంతరం శ్రీపట్టాభి రామస్వామి ఆలయంలోని రావిచెట్టు వద్ద పొర్లు దండాలు పెట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బండి వెంకటలక్ష్మి, మట్టపర్తి వెంకటలక్ష్మి, కె.నాగలక్ష్మి, దొమ్మేటి లలితకుమారి, గుబ్బల వెంకటలక్ష్మి, జి.రాధ, దుర్గామల్లేశ్వరి, జి.ప్రమీల, కె.అనంతలక్ష్మీదేవి, కె.సూర్యకుమారి, ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం: సీఐటీయూ ఆధ్వర్యంలో కె.గంగవరం, రామచంద్రపురం మండలాల ప్రాజెక్టులకు చెందిన అంగన్‌వాడీలు 31వ రోజు దీక్షలను ప్రారంభించారు. శిబిరంలో కూర్చున్న వారికి మున్సిపల్ కార్మికులు సంఘీభావం తెలిపారు. యూనియన్ జిల్లా కార్యదర్శి మేడిశెట్టి దుర్గమ్మ, వాసంశెట్టి సూర్యకుమారి, కె.విజయలక్ష్మి, శ్రీదేవి, గొంతీదేవి, వి.లక్ష్మీరత్నం, వీరవేణి తదితరులు పాల్గొన్నారు.

అమలులో సెక్షన్ 30 పోలీసు యాక్టు

అమలాపురం టౌన్, జనవరి 11: ప్రముఖ హీరో సినిమా విడుదల సందర్భంగా అభిమానులు పలు సూచనలు పాటించాలని అమలాపురం డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ సూచించారు. అమలాపురం సబ్ డివిజన్ పరిధిలో సెక్షన్ 30 పోలీసు యాక్టు అమలులో ఉందన్నారు. ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించరాదన్నారు. పబ్లిక్ ప్రదేశాల్లో వేడుకలను అనుమతించమని బాణాసంచా కాల్పులు నిషేధమని స్పష్టం చేశారు. ద్విచక్ర వాహనాల సైలెన్సర్లు తీసి విన్యాసాలు చేస్తే ఆయా వాహనాలను స్వాధీనం చేసుకుని చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

'అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు'

రామచంద్రపురం, జనవరి 11: సంక్రాంతి సందర్భంగా సంప్రదాయ క్రీడల పేరుతో అసాంఘిక కార్యకలాపాలైన కోడిపందాలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని రామచంద్రపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ నిర్వాహకులను హెచ్చరించారు. కోడిపందాలు, కోడికత్తుల తయారీదారులు, పేకాట నిర్వాహకులపై ఇప్పటికే 470 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసి సంబంధిత తహసీల్దారు కోర్టులో హాజరుపరిచి ముందస్తు పూచీకత్తులు తీసుకున్నామని తెలిపారు.

జేవీఎల్‌కు అంతర్జాతీయ అవార్డు

ముమ్మిడివరం, జనవరి 11: మండలానికి చెందిన విశ్రాంత ఆంగ్ల ఉపాధ్యాయుడు ఎల్టా ఇంటర్నేషనల్ కన్వీనర్ జేవీఎల్ నరసింహారావుకు అంతర్జాతీయ అవార్డు లభించింది. మహారాష్ట్రలోని పూణేకు చెందిన వాక్ బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్ సంస్థ ఎడ్యుకేషనిస్టు విభాగంలో వివేకానంద-2024 ఇంటర్నేషనల్ అవార్డును ఆయనకు ప్రదానం చేసింది. నరసింహారావుకు అంతర్జాతీయ అవార్డు లభించడం ఇది నాలుగోసారి.